క్లుప్తంగా

పేపర్ క్రాఫ్ట్‌లో విద్యార్థులకు శిక్షణ



ఈపూరు: మండల కేంద్రంలోని ఈపూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. దీనిలో భాగంగా శనివారం విద్యార్థులచే కథల పుస్తకాలను చదివించడం జరిగిందని గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పేపర్ క్రాఫ్ట్‌లో విద్యార్థులకు సీహెచ్ పూజిత శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను ఉపయోగించుకోవాలి

నాదెండ్ల: వేసవి సెలవుల్లో విజ్ఞాన శిబిరాలకు వచ్చి మంచి పుస్తకాల అధ్యయనంతో జ్ఞానసంపన్నులు కావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. వేసవిలో జరుగుతున్న విజ్ఞాన శిబిరాలకు హాజరౌతున్న విద్యార్థుల వివరాలు, వారికి శిక్షణనిస్తున్న అంశాలు తదితరాలపై అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుస్తక పఠనంతో ఎంతో గొప్ప జ్ఞానం వస్తుందన్నారు. చదువుతో పాటూ ఆటపాటల్లో భాగస్వాములు కావటం ద్వారా ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాధాన్యతనిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు ఉన్నారు.

పాత వస్తువులు అందజేయాలి

చిలకలూరిపేటటౌన్: ఇండ్లలో వాడుకోని వస్తువులను వేరే వ్యక్తుల ప్రయోజనం కోసం అందించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. శనివారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో రెడ్యూస్ రీ యూజ్ రీ సైకిల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలు పాత బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత బట్టలు, పుస్తకాలు, పాత పాదరక్షలను పట్టణంలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు షేక్ ఇస్మాయిల్, ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల సమాచారం అందించాలి

చిలకలూరిపేటటౌన్: అపరచిత వ్యక్తులు సంచరించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ ఎస్ఐ ఎస్.రాజేష్ చెప్పారు. శనివారం మండలంలోని బొప్పూడి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.

అదుపు తప్పిన లారీ



వినుకొండ (నూజెండ్ల): వేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి నివాస గృహాలపైకి దూసుకుపోయింది. ఈ ఘటన వినుకొండరూరల్ మండలం విఠంరాజుపల్లి గ్రామం వద్ద గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... వినుకొండ నుంచి నరసరావు పేట వైపు లారీ వేగంగా రోడ్డు పక్కన ఉన్న ఇళ్లపైకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటమే కారణమని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండ-కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మన్నం వెంకట అప్పారావు (43) వినుకొండ నుంచి ప్రకాశం జిల్లా చీమకుర్తి వెళ్లి బైక్‌పై వస్తున్న క్రమంలో పసుపులేరు బ్రిడ్జి వద్ద లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గాయపడిన వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: రౌడీషీటర్ చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాగన్నపాలెంకు చెందిన రౌడీషీటర్ జూపల్లి ప్రసాద్‌కు అదే ప్రాంతానికి చెందిన తలమాల బాబురావుతో పాత గొడవలు ఉన్నాయి. ఈ నెల 13వ తేదీ పట్టణంలోని విశ్వనాథ థియేటర్ సమీపంలో బాబురావును చాకుతో ఛాతీ, పొట్టభాగంలో పొడిచి పరారయ్యాడు. స్థానికులు 108 కు సమాచారం అందించగా బాధితుడ్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఏపీకి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరో వైపు నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్ బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తా యాములయ్య, అమీర్‌జాని, చింతా సాంబయ్య అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

చిలకలూరిపేటటౌన్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని శనివారం ఆమె ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవితం ఎల్లప్పుడు స్ఫూర్తి దాయకమని వివరించారు. భారతదేశాన్ని బలమైన, సంపన్నమైన, సమర్థవంతమైనదిగా మార్చటంలో ఆయన పాత్ర గొప్పదన్నారు. కలాం ఆలోచనలు, జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుత్తా యాములయ్య, అమీర్‌జాని, చింతా సాంబయ్య అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహిస్తాం

- కలెక్టర్ శివశంకర్
- కలెక్టరేట్‌లోనెలనెలా సాహిత్య మేళ కార్యక్రమం



కలెక్టరేట్‌లో నిర్వహించిన సాహిత్య సమావేశంలో జిల్లా కలెక్టర్, సత్యశ్రీనివాస అయ్యంగార్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం తెలుగు భాషా ప్రేమికులకు ఉందని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో నెలనెలా సాహిత్య మేళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగుభాష సాహిత్య సమాలోచనపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన తెలుగుభాష పండితులతో కలిసి తెలుగుతల్లి చిత్రపటానికి నమస్కరించి, పూలమాలలు వేసి మననం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురాతన గ్రంథాలు, ఇతిహాసాల ద్వారా చేసిన రచనలతో సమాజ సంస్కృతి, సంప్రదాయాలు బయటకు వచ్చాయని పేర్కొన్నా రు. కళలు, కావ్యాలతో ప్రజలను చైతన్యపర్చేందుకు ఎంతోమంది ప్రముఖులు, కవులు, రచయతలు తమ వైవిధ్యమైన రచనలు, ప్రసంగాలతో సమసమాజ స్థాపనకు కృషిచేశారని కొనియాడారు. అటువంటి తెలుగు నేలపై అనేక కావ్యా లు, కవులు పుట్టి సమాజ చైతన్యం కోసం చేసిన కృషిని జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతీనెలా నిర్వహించేలా చూస్తా మని హామీ ఇచ్చారు. అనంతరం వ్యాస మహాభారతం-నన్నయ మహాభారతం మధ్య కాలంలో తెలుగు భాషలో వచ్చిన మార్పులు, వ్యత్యాశాలు అనే అంశంపై సమావేశంలో చర్చించారు. ఈ అంశాలపై పలువురు ప్రముఖులు సత్యశ్రీనివాస అయ్యంగార్, కే.వి.కోటయ్య, డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పోలెపెద్ది రాధాకృష్ణమూర్తి వక్తలుగా ప్రసంగించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి కె.వి నాయకం, నరసరావుపేట శ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, తెలుగు భాష సాహిత్య ప్రియులు స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ కుటుంబాలకు చెరో రూ.లక్ష సహాయం చేసిన పోలీసుశాఖ



జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కులు స్వీకరించిన వారితో జిల్లా అదనపు ఎస్పీ రామచంద్రరాజు

నరసరావుపేట: రోడ్డు ప్రమాదం, అనారోగ్య కారణాలవల్ల మృతిచెందిన ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చేయూత పథకం కింద పోలీస్ శాఖ తరఫున ఆర్థిక సహాయం చెక్కులను జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) రామచంద్రరాజు అందజేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మృతిచెందిన ఏఎస్ఐ చంద్రశేఖరరెడ్డి సతీమణి పుణ్యాల వెంకట రమణకు, హెడ్ కానిస్టేబుల్ తాళ్లూరి సూర్యనారాయణ భార్య నెల్లూరి లతకు, రూ.1 లక్ష చొప్పున రెండు చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం అందజేశారు. నరసరావుపేట టు టౌన్ పోలీస్‌స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి క్యాన్సర్ వ్యాధితో మృతి చెందగా, నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

కళాసాగరి ట్రస్ట్ నాటకోత్సవాలు ప్రారంభం



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

వినుకొండ(నూజెండ్ల) : కళాసాగరి ట్రస్ట్ నాటకోత్సవాలు స్థానిక జాషువా కళా ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ట్రస్ట్ సభ్యులు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భరణి నాట్య అకాడమీ (గుంటూరు), లక్ష్మీ నాట్య కళాశాల (వినుకొండ) బాలలు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకర్షించాయి. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ట్రస్ట్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. బాలల నృత్యాలు విశేషంగా ఆముతులను ఆకర్షించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్‌లో మరెన్నో కార్యక్రమాలు జరగాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కూచి రామాంజనేయులు, సదాశివరావు, కోటి, బత్తుల శ్రీనివాసరావు, ఆదినారాయణ, ఆలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ లోకి..



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

నూజెండ్ల (వినుకొండ): వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన మూడు కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కోయలపల్లి ఆనందరావు, కె.సుబ్బారావు, సాంబయ్యలతోపాటు పలువురు పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆకర్షితులై, నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ తమ స్వగ్రామం నుంచి పార్టీలో చేరడంతో అభినందనీయమన్నారు. పార్టీలో చేరిన వారిని తమ కుటుంబ సభ్యులతో సమానంగా భావిస్తామన్నారు. వారికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా కోటేశ్వరరావు, మోహనకృష్ణారెడ్డి ఎన్నిక



ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి

నరసరావుపేట: జీవిత భీమా నరసరావుపేట బ్రాంచ్ ఏజెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీ వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షులుగా పావులూరి కోటేశ్వరరావు, కార్యదర్శిగా గాదె మోహనకృష్ణారెడ్డి, కోశాధికారిగా మిట్టా శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా వేల్పుల కోటేశ్వరరావు, పొట్టి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శిగా షేక్ బాబావలిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలిండియా సెక్రటరీ జనరల్ ఎస్‌బీ శ్రీనివాసాచారి, జోనల్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఎం.రామచౌడారెడ్డి, సెక్రటరీ ఎస్.మోహనబాబు, డివిజన్ గౌరవాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరాజు, ఏవీ సీతారామయ్య, సీనియర్ నాయకులు బీఎస్ చారి, జోనల్ మాజీ అధ్యక్షులు కేటీకే విఠల్, ఏజెంట్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీఐ సుధాకర్



మాట్లాడుతున్న సీఐ సుధాకర్

శావల్యాపురం: గ్రామాల్లోని ప్రజలందరూ చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. మండలంలోని పిచకలపాలెం గ్రామంలో ప్రధాన కూడలి మార్గంలో ఎస్పీ ఆదేశాలు మేరకు పల్లె నిద్ర కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ పేకాట, అసాంఘిక కార్యాకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న వాటిపై పోలీసులు దృష్టి సాలించి సమస్యలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరు ఉండాలనే ఉద్దేశ్వంతో పల్లెనిద్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

వేసవి వినోద కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దేవానంద్

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి వినోదం శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ చెప్పారు. శనివారం పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన గత ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న వేసవి వినోదం శిక్షణా శిబిరాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే శిక్షణ శిబిరానికి హాజరయ్యేలా చూడా లని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లా డి శిబిరం ద్వారా నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి ఎక్కువ మంది సందర్శకులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి నాగుల్ మీరావలి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



ఆకు కూరల సాగును పరిశీలిస్తున్న అధికారి

వినుకొండ(నూజెండ్ల): ప్రతి రైతు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో శనివారం ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. బెండ, వంగ, డ్రాగన్ ఫ్రూట్, ఆకుకూరలు సాగు చేసిన పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీపీఎం అమలకుమారి పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ మట్టి నమూనాలు చేయించుకోవడం ద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కౌలు రైతులు కార్డులు తీసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులు గ్రామంలోని జడ్బీఎన్ఎఫ్ సిబ్బంది ద్వారా నేర్చుకొని సాగు చేయాల్సిందిగా సూచించారు. ఏడీఏలు సీహెచ్.రవికుమార్, బి.రవిబాబులు మాట్లాడుతూ పురుగుమందులు లేని కాలుష్య రహిత ఆహారాన్ని ప్రకృతి వ్యవసాయం ద్వారా పొందవచ్చని తెలిపారు. అనంతరం జీలుగ 50 శాతం రాయితీపై, పీఎండీఎస్ కిట్స్ 10మంది రైతులకు పంపిణీ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవోలు కె.అంజిరెడ్డి, ఆర్.రామారావు, వినుకొండ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజేశ్వరరావు, మండలంలోని అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలి

ప్రపంచ దీప స్మృత్యంజలి సందర్భంగా పట్టణంలో నేడు ర్యాలీ

నరసరావుపేట: సమాజంలో హెచ్ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి అన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఏడాది మే మూడో ఆదివారం ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ నిర్వహించే ప్రపంచ దీప స్మృత్యంజలిలో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొంటారన్నారు. పూర్వం ఈ వ్యాధి గురించి అవగాహన లేక చనిపోయిన వారి కుటుంబాలు నేడు సమాజంలో ఆర్థికంగా ఎన్నో బాధలు అనుభవిస్తున్నాయన్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారిని మనం ప్రేమతో ఆదరించి మనో ధైర్యం నింపాల్సిన అవసరం ఉందన్నారు. పల్నాడు జిల్లాలో 9537 మంది సక్రమంగా మందులు వాడుతున్నారన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెచ్ఐవీ టెస్టులు ఉచితంగా చేస్తున్నారని, మూడు నెలలపాటు నిరంతరంగా జ్వరం వస్తూ పోతూ ఉండటం ఈ వ్యాధికి ఒక లక్షణమని, మరో లక్షణం బరువు తగ్గిపోతుండటం, మూడోది డయేరియా ఉన్నా పరీక్షలు చేయించుకోవాలన్నారు.

25న జాబ్‌మేళా

ఈపూరు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఏటి అగ్రహారంలోని పోలేరమ్మ కల్యాణ మండపం ఆవరణలో ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు శనివారం తెలిపారు. ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ఫార్మా కంపెనీలో టెక్నికల్ ట్రైనీలుగా పనిచేయుటకు ఇంటర్‌మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ నందు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన 17- 20 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగంతో పాటు బీఎస్సీ, డిగ్రీ ఫార్మాసైన్స్ కోర్సులను ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ సౌజన్యంతో ఉచితంగా చదివించడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి గల యువతీయువకులు విద్యార్హత సర్టిఫికెట్లు నకలు, రేషన్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 25వ తేదీ ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 6302096189, 0863-2950296 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఈపూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు జూన్ 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వల్లెపు శ్రీను శనివారం తెలిపారు. మోడల్ స్కూల్లో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశం ఉంటుందని, ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు ఫీజు చెల్లించాలన్నారు. మార్కులు, మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సిఐ అశోక్ కుమార్ శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన బాలిక శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే జీవీపై కేసు నమోదు

వినుకొండ(నూజెండ్ల): జిల్లా టీడీపీ అధ్యక్షుడు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుపై శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై ర్యాలీ చేయడం, బహిరంగ సభ నిర్వహించడమే కాకుండా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడంతో జాతీయరహదారిపై 4 గంటలు ట్రాఫిక్ జామ్ అయింది. నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించడంపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు శావల్యాపురం ఎస్ఐ గల్లా రవికుమార్ తెలిపారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించుకోవాలి

జిల్లా ఇన్‌స్పెక్టర్ కరిముల్లా బాషా

నాదెండ్ల: వక్ఫ్ బోర్డ్ ఆస్తులను పరిరక్షించుకోవాలని, అందుకు ఆస్తులను వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో రిజిష్టరు చేయించుకోవాలని జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా బాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం పెద్దలు, ముతవల్లిలు, ధర్మకర్తలు, కమిటీ ప్రెసిడెంట్లు, కమిటీ సభ్యులకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ స్పెషలాఫీసర్ పలు సూచనలు చేసినట్లు చెప్పారు. మసీదు, దర్గాలు, ఈద్గాలు, పీర్ల చావిడీ, పీర్ల పంజాలు, అషుర్‌ఖానా, ముసాఫిర్ ఖానాలు, తకియా, ముస్లిం శ్మశాన వాటికలు, చిల్లాలు, జెండా చెట్లు మొదలగువన్నీ వక్ఫ్ బోర్డు పరిధిలోకి వస్తాయన్నారు. పైన తెలిపిన ఆస్తులన్నీ ముందుగా జిల్లా కార్యాలయంలో రిజిస్టరు చేయించుకోవాలన్నారు. వక్ఫ్‌బోర్డు జాబితాలో పరిశీలించుకోవాలన్నారు. వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమైతే వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో గానీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలన్నారు. వివరాలకు వక్ఫ్ బోర్డ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లాబాషా 8978858114 నంబరులో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో నివాసం దగ్ధం

వినుకొండటౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని రూ. 1.90 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కోటా సతీష్ కుమార్‌కు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి ఇంట్లోని ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.1.90 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు.